క్లుప్తంగా

వాహనాల విస్తృత తనిఖీ



మంగళగిరి: మంగళగిరి రూరల్ పరిధిలో పలుచోట్ల రూరల్ పోలీసులు విస్తృతంగా వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఎన్నికల నేపథ్యంలో నగదు, తాయిలాలు రవాణా కాకుండా వాహనాలను తనిఖీ నిర్వహించినట్లు సీఐ వెంకటరావు తెలిపారు. ఎన్నికల నిబంధనలు అతిక్రమించి నగదు, ఏవైనా వస్తువులు రవాణా చేస్తే కేసు నమోదు కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రత్యేక బృందాల ఆధ్వర్యంలో పలుచోట్ల కార్లు, ద్విచక్ర వాహనాలు తనిఖీలు చేశారు. తనిఖీలలో ఎస్ఐ క్రాంతి కిరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు స్ఫూర్తిప్రదాతలు పుస్తకావిష్కరణ



మంగళగిరి: పట్టణంలోని వీజేటీఎం ఐవీటీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈ నెల 7వ తేదీ సోమవారం సాయంత్రం 5 గంటలకు మంగళగిరి సాహితి కళావేదిక ఆధ్వర్యంలో స్ఫూర్తిప్రదాతలు పుస్తకావిష్కరణ చేయనున్నట్లు కళావేదిక ప్రతినిధులు తెలిపారు. ఈసందర్భంగా శనివారం కళావేదిక కార్యాలయంలో కరపత్రాలను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ తమ జీవితం ద్వారా సమాజంలో స్ఫూర్తి నింపిన 20 మంది మహోన్నత వ్యక్తుల గురించి ప్రముఖ సాహితీ విమర్శకులు అబ్దుల్ రజాక్ హుస్సేన్ రచించిన స్ఫూర్తిప్రదాతలు పుస్తకం ఆవిష్కరణ చేయడం జరుగుతుందన్నారు. కళావేదిక ప్రతినిధులు గుత్తికొండ ధనుంజయరావు, రేఖా కృష్ణార్జునరావు, మంచా విజయ మోహనరావు, గోలి మధు, కంచర్ల కాశయ్య, సిందే బాలకృష్ణ, చిలకా వెంకటేశ్వరరావు, రేఖా నర్మద తదితరులు పాల్గొన్నారు.

అంతరంగ సంస్కరణే అద్భుత ఔషధం



తాడేపల్లి రూరల్ : సమాజంలో అంతర్గతంగా జరుగుతున్న నేరాలన్నింటికీ మనుషుల అంతరంగంలో చోటు చేసుకుంటున్న విపరీత ధోరణులే ప్రధాన కారణమని మాజీ డీజీపీ డాక్టర్ ఎం. మాలకొండయ్య అభిప్రాయం వ్యక్తం చేశారు. మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి వడ్డేశ్వరం కేఎల్ విశ్వవిద్యాలయంలో అంతర్గత భద్రత, సవాళ్లు, పరిష్కారాలు అనే అంశంపై సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన మాలకొండయ్య ప్రసంగిస్తూ.. మతాలు, కులాలు, ప్రాంతాలు, భాషలు వంటి అంశాలను బూచిగా చూపి ఆ ముసుగులో నేరాలకు పాల్పడేవారు కొందరైతే, నేరాన్ని వృత్తిగా మలచుకొని జీవించేవారు ఇంకొందరన్నారు. ఇలాంటి అంశాలపై యువత అప్రమత్తంగా ఉండాలని విద్యార్థులను సూచించారు. ఆరోగ్యవంతమైన శరీరంలోనే స్థిర చిత్రమైన మనసు ఉంటుందన్నారు. బిఏఏఎస్ విభాగాధిపతి డాక్టర్ బి. శివనాగయ్య మాట్లాడుతూ నేటి పోటీ పరీక్షల్లో అంతర్గత భద్రత అనే అంశం చాలా కీలకమైనదన్నారు. కార్యక్రమంలో వర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థ సారధి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్లు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎస్. వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, ఎంహెచ్ఎస్ డీన్ డాక్టర్ ఎం.కిశోర్‌బాబు, విభాగ ఉపాధిపతి డాక్టర్ కె. అనిల్ కుమార్, మునీశ్, డాక్టర్ ప్రజాపతి, ఆర్. సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మణిపాల్‌కు సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు

తాడేపల్లి రూరల్ : తాడేపల్లి పట్టణ పరిధిలోని మణిపాల్ ఆసుపత్రికి రోబోటిక్ ఇన్నోవేటివ్ సర్జరీలో చేసిన కృషికి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డు వరించింది. శనివారం ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ కంటిపూడి సుధాకర్ వివరాలు వెల్లడించారు. రోబోటిక్ శస్త్రచికిత్సలో ఆసుపత్రి చూపిన ప్రతిభను రోబోటిక్ ఇన్నోవేటివ్ సర్జన్స్ అసోసియేషన్ గుర్తించి ఈ పురస్కారానని ప్రకటించిందని తెలిపారు. సంప్రదాయ ఓపెన్ సర్జరీతో పోలిస్తే చిన్న కోత, తక్కువ నొప్పి, తొందరగా కోలుకునేలా రోబోటిక్ శస్త్ర చికిత్స ఉంటుందన్నారు. వైద్యులు డాక్టర్ సురేంద్రజాస్తి మాట్లాడుతూ రోబోటిక్ సర్జరీతో రోగుల సంరక్షణలో మెరుగైన పరివర్తనను ప్రత్యక్షంగా చూశామన్నారు. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ గుర్తింపు లభించడం ఆనందంగా ఉందని ఆయన అన్నారు.

పౌష్టికాహారం పంపిణీ

తెనాలిఅర్బన్: క్షయ వ్యాధిని నియంత్రణకు పౌష్టికాహారం ఎంతో దోహదపడుతుందని టీబీ యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కె.రాధిక పేర్కొన్నారు. జిల్లా వైద్యశాలలోని టీబీ యూనిట్‌లో కోహెన్స్ వారి సహకారంతో క్షయ వ్యాధిగ్రస్తులకు శనివారం పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనిట్ సిబ్బంది రవికుమార్, లక్ష్మి, భార్గవి, దిలీప్, పావని పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి అండగా నిలుద్దాం

- పార్టీ మంగళగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య
- 10వ వార్డులో ప్రజలతో ఆత్మీయ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న మురుగుడు లావణ్య

మంగళగిరి: వైఎస్సార్ సీపీకి అండగా నిలబడి మంగళగిరి అభివృద్ధికి సహకరించాలని పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మురుగుడు లావణ్య కోరారు. పట్టణంలోని 10వ వార్డు గాజుల బజార్‌లో స్థానికులతో శనివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ గత ఐదు సంవత్సారాల వైఎస్సార్ సీపీ పాలనలో గతంలో ఎన్నడూ లేనివిధంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సహకారంతో ఎమ్మెల్యే ఆర్కే అభివృద్ధి చేశారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బీసీ అభ్యర్థినైన తనను మంగళగిరి నియోజకవర్గ అభ్యర్థిగా నిలబెట్టి బీసీలకు అధికారం దక్కేలా చూడడం అభినందనీయమన్నారు. సంక్షేమ పథకాలు ఇంటి వద్దకు రావాలన్నా.. మంగళగిరి మరింత అభివృద్ధి చెందాలన్నా.. వైఎస్సార్ సీపీ ఓటువేసి, తన విజయానికి సహకరించాలని కోరారు. టీడీపీ అభ్యర్థి నారా లోకేష్‌ను కలవాలన్నా సామాన్యులకు కుదరదన్నారు. ఇప్పటికే 40 మంది పోలీసులతో రక్షణ ఏర్పాటు చేసుకున్న లోకేష్ సామాన్యులనే కాక వారి పార్టీ కార్యకర్తలనే దగ్గరకు రానివ్వడం లేదని విమర్శించారు. ఇరవై నాలుగు గంటలు మీకు అందుబాటులో వుండి మీ సమస్యలను నేరుగా విని పరిష్కరిస్తానన్నారు. ఎవరు ఏ సమస్యపై ఎప్పుడూ ఇంటికి వచ్చినా తాను ముందుండి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని, ఫ్యాను గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని అభ్యర్థించారు. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ ఆకురాతి రాజేష్, తాడేపల్లి పట్టణ కన్వీనర్ బుర్రముక్కు వేణుగోపాల స్వామిరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ ఎండీ ఫిరోజ్, మహిళా నాయకురాలు మల్లవరపు సుధారాణి, స్థానిక నాయకులు మురుగుడు సత్యం, తిరుమలశెట్టి కృష్ణమూర్తి, తిరుమలశెట్టి శ్రీనివాసరావు, శంకర్, ఆకురాతి శివభాస్కరరావు, నాగమల్లీశ్వరి, గుండా మధు తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధం

లచ్చన్నగుడిపూడి ప్రచారంలో వైఎస్సార్ సీపీ తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే సుచరిత



గ్రామంలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

లచ్చన్నగుడిపూడి(తాడికొండ): ప్రతి పేదవాడికి మేలు చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మరోసారి పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని వైఎస్సార్ సీపీ తాడికొండ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. తాడికొండ మండలం లచ్చన్నగుడిపూడి గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో ఆమె ఇంటింటికీ తిరిగి ఓట్లు అభ్యర్థించారు. తొలుత మోతడక సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ర్యాలీగా గ్రామానికి చేరుకొని ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుచరిత మాట్లాడుతూ ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అని, ప్రతి గడపకు తిరుగుతున్న సమయంలో లబ్ధిదారుల కళ్ళలో కనిపిస్తున్న ఆనందమే అందుకు ఉదాహరణ అన్నారు. సంక్షేమ పథకాల అమలులో ఏపీ దేశానికే ఆదర్శంగా నిలిచిందనడంలో సందేహం లేదన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థ ద్వారా పాలనను ప్రతి పేదవాడికి చేరువ చేసిన జగనన్న పథకాలు ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. కులం, మతం, ప్రాంతం, పార్టీ భేదం లేకుండా ఏపీలో సంక్షేమం, అభివృద్ధి గత 5 ఏళ్ళలో అందించినందునే నేడు మీకు మేలు జరిగితేనే నాకు ఓట్లు వేయండని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరుతున్నారన్నారు. ప్రజలు 175/175 సీట్లలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని గెలిపించడం ఖాయమన్నారు. వలంటీర్‌ల ద్వారా వృద్ధులు, దివ్యాంగులకు పింఛన్లు అందకుండా ఫిర్యాదులు చేసిన చంద్రబాబు చేసిన దుర్మార్గ ఆలోచన ఫలితంగా నేడు ఏపీలో లక్షల మంది వృద్ధులు, దివ్యాంగులు నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. జడ్పీటీసీ గుడిమెట్ల జ్యోతి, యార్డు చైర్మన్ చిమటా పూర్ణచంద్రరావు, ముఖ్య నాయకులు తాళ్ళ శివనాగరాజు, పార్టీ మండల అధ్యక్షుడు బొర్రా వెంకటేశ్వర రెడ్డి, నిడుముక్కల, కంతేరు సర్పంచ్‌లు మాదాసు రత్నకుమారి, బెజ్జం మహేష్ బాబు, ఎంపీటీసీలు వలపర్ల కల్పన, బోడపాటి సుశీల, వివిధ విభాగాల నాయకులు చిట్టా అంజిరెడ్డి, బుర్రా వెంకట శివారెడ్డి, భీమవరపు బ్రహ్మారెడ్డి, భీమవరపు శ్రీనివాస రెడ్డి, శంకర్ పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సృజనాత్మకతను వెలికితీసేందుకు ఫెస్ట్‌లు దోహదం


- శాప్ ప్రతినిధులు జయంత్ బగారే, భరత్ ప్రసాద్
- మోతడక చలపతిలో ఘనంగా హ్యాక్ ఫెస్ట్– 2024 రీజనల్ రౌండ్ పోటీలు



అతిథులను సత్కరిస్తున్న చలపతి విద్యాసంస్థల సెక్రటరీ వై.సుజిత్ కుమార్

మోతడక(తాడికొండ): విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను ప్రదర్శించి వెలికితీసేందుకు ప్లాట్‌ఫామ్‌గా సాంకేతిక ఫెస్ట్‌లు ఎంతగానో దోహదం చేస్తాయని శాప్ ప్రతినిధులు జయంత్ బగారే, భరత్ ప్రసాద్‌లు అన్నారు. మోతడక చలపతిలో పీఎస్‌జీ టెక్నాలజీ, శాప్ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఐటెక్ హ్యాక్ ఫెస్ట్– 2024 రీజనల్ రౌండ్ పోటీలకు వారు ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రసంగించారు. విద్యార్థులు రియల్ వరల్డ్ సమస్యలకు, ఇన్నోవేటివ్ ఐడియాలను ప్రదర్శించడానికి, పరిశ్రమ మరియు అకడమిక్ ప్రతినిధులతో తమ అభిప్రాయాలను పంచుకునేందుకు వారి అనుభవాల నుంచి విలువైన విషయాలను నేర్చుకోవడానికి ఉపయోగ పడుతుందన్నారు. మొత్తం 112 టీమ్‌లు పాల్గొని తమ ఐడియాలను క్లౌడ్‌సోర్స్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్, గ్రీన్ క్రెడిట్ మేనేజ్‌మెంట్, రివల్యూషనైజింగ్ టుమారో హార్నెసింగ్‌కు సంబంధించిన అంశాలపై జ్యూరీ మెంబర్స్‌కు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. 20 మంది జ్యూరీ మెంబర్లు 10 ప్యానల్స్‌గా ఏర్పడి పోటీలకు వచ్చిన 112 టీమ్‌ల నుంచి 10 టీమ్‌లను తదుపరి రౌండ్స్‌కు ఎంపిక చేశారు. ఈ టీమ్‌లకు కళాశాల సెక్రటరీ వై.సుజిత్ కుమార్ రూ.5వేలు చొప్పున నగదు బహుమతి, ప్రశంసా పత్రాలు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన ఐడియాలలో తుపాను బాధిత ప్రాంతాలలో సహాయ చర్యలకు కృత్రిమ మేధను ఉపయోగించి సత్ఫలితాలు సాధించడం, అటవీ ప్రాంతంలో నీటి వనరులను సమర్థవంతంగా ఉపయోగించి వాతావరణ కాలుష్యాన్ని నియంత్రించడం వంటివి అందరినీ ఆకర్షించాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కిరణ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు, ప్రోగ్రాం కో–ఆర్డినేటర్‌లు ఎస్.శాంతి ప్రియ, డాక్టర్ బి.బాల మురళీకృష్ణ, వివిధ శాఖాధిపతులు పాల్గొన్నారు.

సైన్స్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థినికి అభినందన




విద్యార్థినిని అభినందిస్తున్న ఎంఈఓలు గరిక శాంతకుమారి, డి.నాగేశ్వరరావు

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నులకపేట మండల పరిషత్ ప్రాథమికోన్నత ఉర్దూ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థినిని తాడేపల్లి మండల విద్యాశాఖాధికారులు గరిక శాంతకుమారి, డి.నాగేశ్వరరావులు అభినందించారు. పాఠశాలలో శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం అబ్దుల్ షజీర్ మాట్లాడుతూ సైన్స్‌డే సందర్భంగా జనవిజ్ఞాన వేదిక, ఆంధ్రప్రదేశ్ వారు ఆన్‌లైన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి సైన్స్ పోటీలు – 2024 లో తమ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న షేక్ సమీవూన్ ద్వితీయ బహుమతి సాధించిందని ఆ బహుమతిని మండల విద్యాశాఖాధికారులు గరిక శాంతకుమారి, డి. నాగేశ్వరరావులు విద్యార్థినికి అందజేశారని తెలిపారు. మండల విద్యాశాఖాధికారులు గరిక శాంతకుమారి, డి.నాగేశ్వరరావులు మాట్లాడుతూ రానున్న ఉపాధ్యాయ దినోత్సవం నాడు ప్రకటించే జిల్లా, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు షేక్ షాహిద్ అలీ పేరును సిఫార్సు చేస్తామని అన్నారు. అనంతరం విద్యార్థులకు సరైన తర్ఫీదు ఇచ్చి మండల, జిల్లా మరియు రాష్ట్రస్థాయి బహుమతులు సాధిస్తున్న భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు షేక్ షాహిద్ అలీని సత్కరించారు. పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ షేక్ జిలానీ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న పంట పరిశీలన

సాక్షి ఎఫెక్ట్..



రైతును వివరాలు అడిగి తెలుసుకుంటున్న వ్యవసాయ శాఖ అధికారులు

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని వీర్లపాలెం, తుమ్మపూడి ప్రాంతాల్లో మొక్కజొన్న రైతులు ప్రైవేటు కంపెనీల విత్తనాలను కొనుగోలు చేసి మోసపోయిన విషయమై మార్చి 23న 'నట్టేట మునిగిన మొక్కజొన్న రైతు' శీర్షికన 'సాక్షి'లో కథనం వెలువడింది. దీనిపై స్పందించిన వ్యవసాయ శాఖ అధికారులు శనివారం దుగ్గిరాల మండల పరిధిలోని వీర్లపాలెం, తుమ్మపూడి గ్రామాల్లో నష్టపోయిన రైతులను పరామర్శించారు. లాంఫాంకు చెందిన శాస్త్రవేత్తలు డాక్టర్ వై.సతీష్ కుమార్, డాక్టర్ పుష్పరేణి మైకో ఎంఆర్‌ఎం 4065 మొక్కజొన్న విత్తనాలు వాడిన పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త డాక్టర్ వై.సతీష్ మాట్లాడుతూ నష్టపోయిన మొక్కజొన్న రైతుల పొలాల నుంచి మొక్కజొన్న పొత్తులను సేకరించి దిగుబడిని కూడా పరిశీలిస్తున్నామని, తదుపరి విచారణ అనంతరం కంపెనీపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ జి.రామచంద్రరావు, తెనాలి సబ్ డివిజన్ ఏడీఏ ఎస్.ఉషారాణి, వ్యవసాయ అధికారి శిరీష తదితరులు పాల్గొన్నారు.

నిర్మల ఫార్మసీ కళాశాలలో ప్రాంగణ ఎంపికలు



మంగళగిరి: నగర పరిధిలోని ఆత్మకూరు జాతీయరహదారి వెంట కల నిర్మల ఫార్మసీ కళాశాలలో పలువురు విద్యార్థులు ప్రాంగణ ఎంపికల్లో ఉద్యోగాలు సాధించినట్లు ప్రిన్సిపాల్ బి.పాములరెడ్డి తెలిపారు. శనివారం కళాశాల ఆవరణలో ఒమెగా హెల్త్ కేర్ ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించగా 200 మంది విద్యార్థులు హాజరుకాగా, 86 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించగా, వారికి రూ 2.50లక్షల వార్షిక వేతనం అందుతుందన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల సెక్రటరీ సిస్టర్ నిర్మలజ్యోతి, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ శంఖుల కామేశ్వరరావు, సమన్వయకర్తలు డాక్టర్ సుధీర్, జోజిబాబులు అభినందించినట్లు తెలిపారు.

ప్రజలకు అందుబాటులో ఉండేలా చర్యలు


ఫిరంగిపురం: మండలంలో ఎండతీవ్రత ఎక్కువగా ఉండనుండటంతో పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ అధికారులు, ఆరోగ్యసిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి వారికి తగిన జాగ్రత్తలు తెలియజేయాలని తహసీల్దార్ జి.రాఘవేంద్రరావు అన్నారు. కార్యాలయంలో ఆయాశాఖల అధికారులు, సిబ్బందితో మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉందనే వాతావరణ శాఖ హెచ్చరికలతో తీవ్ర వడగాల్పులు వీచే అవకాశం ఉందని, ఈసమయంలో ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. మధ్యాహ్న సమయంలో ప్రజలు బయటకు రావద్దని తెలియజేయాలని చెప్పారు.

మోదీ పాలనలో దేశ అభివృద్ధి పదేళ్లు వెనక్కి

తాడేపల్లిరూరల్: ప్రధాని మోదీ పరిపాలనలో దేశం అభివృద్ధిలో పదేళ్ల వెనక్కి వెళ్లిందని సీపీఎం రాష్ట్ర నాయకుడు వి.కృష్ణయ్య అన్నారు. శనివారం గుంటూరు జిల్లా ఉండవల్లిలో జరిగిన రైతుల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా వి.కృష్ణయ్య మాట్లాడుతూ నియంతృత్వ ధోరణిలో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం పాలు చేస్తున్న మోదీని, అతని మిత్రులను ఓడించాలని అన్నారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం జీఎస్టీ పేరుతో ప్రజల జేబులు ఖాళీ చేస్తోందని, పెట్రోల్, డీజిల్, నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని విమర్శించారు. రైతుల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న మోదీకి రైతాంగం తగినరీతిలో గుణపాఠం చెప్పేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సీపీఎం అభ్యర్థి జొన్న శివశంకరరావు మాట్లాడారు. సీపీఎం నాయకులు ఎస్‌కే ఎర్రపీరు, సైతం వెంకట నారాయణ, ఎస్.ఇమ్మానియేల్ రాజు, పి.గాంధీ, రైతు నాయకులు వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

జగనన్న హయాంలో మహిళలే మహారాణులు

మాజీ ఎమ్మెల్యే కాంద్రు కమల



ఉండవల్లిలో ప్రచారం నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కమల

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని ఉండవల్లిలో మాజీ ఎమ్మెల్యే కాంద్రు కమల వైఎస్సార్ సీపీ నాయకులతో కలసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే కాంద్రు కమల మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారం చేపట్టిన తరువాత దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో మహిళలకు అధిక ప్రాధాన్యత ఇచ్చి మహిళలను మహారాణులుగా చూసుకుంటున్నారన్నారు.
మరోసారి అందరూ కలసి జగనన్నను ముఖ్యమంత్రిగా చేసుకుంటే మన కుటుంబాల్లో ఎంతో మార్పు వస్తుందని, ఆయన ప్రవేశపెట్టిన ప్రతి ఒక్క పథకంలో మహిళలకు లబ్ధిచేకూరే విధంగా చేశారని, గృహిణులు ఆర్థికంగా బలపడినపుడే వారి కుటుంబాలు ఎంతో బాగుంటాయని నమ్మిన వ్యక్తి సీఎం వైఎస్ జగన్ అనిఅన్నారు. చివరకు ఆరోగ్య సమస్యలను పరిష్కరించేందుకు ప్రతి ఇంటికి మహిళా డాక్టర్లను పంపించి ఆరోగ్య సమస్యలు తెలుసుకుని ఆ సమస్యలకు ఉచితంగా సేవలు అందిస్తున్నారని, జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని అన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు దంటు బాలాజీ రెడ్డి, ఎంఎస్ఆర్, కొల్లి మునలారెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు మేకల హనుమంతరావు, యాదవ సంఘం నాయకులు హరీష్, శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నగర ప్రజల దాహార్తి తీరేలా!

- రూ.39 లక్షలతో 40 చలివేంద్రాలు ఏర్పాటు
- చలివేంద్రాల వద్ద వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తల బోర్డులు సైతం ఏర్పాటు



నగరంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం

మంగళగిరి: వేసవిలో నగరానికి వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ అధికారులు చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. నగరంలోని పలు కూడళ్లతో పాటు విలీన గ్రామాలలోను చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చుతున్నారు. నగరంలో రూ.39లక్షలతో 40 చలివేంద్రాలను అందుబాటులోకి తీసుకువచ్చారు. చల్లని కుండలలో తాగునీటిని నింపి ఒక మనిషిని ఏర్పాటు చేసి వాహనదారులు. పాదచారుల దాహం తీరుస్తున్నారు. నగరంలో ఎన్ఆర్ఐ వై.జంక్షన్. పాతబస్టాండ్, కార్పొరేషన్ కార్యాలయం, రత్నాల చెరువు, ఎంఎస్ఎస్ నగర్, టిడ్కో నివాసాలు, మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్, వడ్లపూడి సెంటర్, మిద్దె సెంటర్, గాంధీ బొమ్మ, చినకాకాని ఆర్పీ, కాజలతో పాటు విలీన గ్రామాలలో పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. అధికంగా ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు, పంచాయతీ కార్యాలయాలకు, సచివాలయాలకు వస్తున్న నేపథ్యంలో ప్రజలకు ఇబ్బంది లేకుండా ఆయా కార్యాలయాల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. చలివేంద్రాలను ఏర్పాటు చేయడంతో ఎండలు అధికంగా ఉన్న కారణంగా ఎండలలో ప్రజల ఆరోగ్యాలను కాపాడేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలతో సూచక బోర్డులు ఏర్పాటు చేయడం ప్రజలు ఆసక్తిగా చూస్తున్నారు. ప్రజల దాహార్తిని తీర్చడంతో ఆరోగ్య పరిరక్షణకు కార్పొరేషన్ ఆధ్వర్యంలో బోర్డులు ఏర్పాటు చేయడం అభినందనీయమని ప్రజలు కొనియాడుతున్నారు. ఎండ అధికంగా ఉన్న సమయంలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను సూచిస్తూ బోర్డులను ఏర్పాటు చేశారు.

నాయకులు అప్రమత్తంగా ఉండాలి

- ప్రతి ఓటరూ పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసేలా చూడాలి
- ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు

మంగళగిరి: నియోజకవర్గంలో ప్రతి ఓటరూ పోలింగ్ కేంద్రానికి వెళ్లి ఓటు వేసేలా పార్టీ నాయకులు, కార్యకర్తలు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) కోరారు. నగరంలోని ఆటోనగర్‌లోని ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయంలో శనివారం పార్టీ నాయకులతో ఎమ్మెల్సీ హనుమంతరావుతో కలిసి మంగళగిరి తాడేపల్లి పట్టణాలు, మండలాలు దుగ్గిరాల మండల నాయకులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వార్డుల వారీగా ఉన్న ఓటర్లు అంతా పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు వేసేలా ఆయా వార్డు నాయకులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన ఐదు సంవత్సారాలలో ముఖ్యమంత్రి అమలు చేసిన సంక్షేమ పథకాలు రాష్ట్రంలోని ప్రతి ఇంటికి అందాయని ప్రజలకు వాటి గురించి వివరించి ఓట్లుగా వేయించుకుంటే పార్టీ ఘనవిజయం సాధిస్తుందన్నారు. ఆయా వార్డులలో స్థానిక కార్యకర్తలు, అభిమానులను సమన్వయం చేసుకుని పోలింగ్ వందశాతం జరిగేలా చూడాలన్నారు. టీడీపీపై ప్రజలలో నమ్మకం లేకపోవడం మంగళగిరి నియోజకవర్గంలో టీడీపీ నుంచి పోటీ చేస్తున్న నారా లోకేష్ వారి నాయకులకు, కార్యకర్తలకే అందుబాటులో ఉండకపోవడం, భారీ సెక్యూరిటీ మధ్య ప్రజలు కలవలేకపోవడంతో ప్రజలు వైఎస్సార్ సీపీకి ఓటు వేసి స్థానికురాలుగా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో వుండే మురుగుడు లావణ్యను గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఓటరును పోలింగ్ కేంద్రానికి తీసుకెళ్లగలగడమే వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల పని అన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు, పట్టణ అధ్యక్షుడు ఆకురాతి రాజేష్,తాడేపల్లి కన్వీనర్ బుర్రముక్క వేణుగోపాలస్వామిరెడ్డి, రూరల్ కన్వీనర్ మున్నంగి వివేకానందరెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు ఈదులమూడి డేవిడ్‌రాజు, ఎండీ ఫిరోజ్, దుగ్గిరాల నాయకులు దాసరి వీరయ్య, శృంగారపాటి రత్నం, దానబోయిన వెంకటేశ్వర రావు(డీవీఆర్), మహిళా నాయకురాలు సంకె సునీత, మల్లవరపు సుధారాణి, నాయకులు నాలి వెంకటకృష్ణ, గూండా మధు, శావలి థామస్, పులివర్తి రాంబాబు, సాలి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

20 మంది వలంటీర్లు రాజీనామా



ఎంటీఎంసీ కార్యాలయం వద్ద రాజీనామా పత్రాలు చూపుతున్న వలంటీర్లు



కంతేరులో పంచాయతీ కార్యదర్శికి రాజీనామా పత్రాలు అందిస్తున్న వలంటీర్లు

మంగళగిరి: నగరంలో 20 మంది వలంటీర్లు శనివారం రాజీనామా చేశారు. వివిధ సచివాలయాల పరిధిలో రాజీనామాలు చేసి అధికారులకు అందజేశారు. 17వ సచివాలయం బాపనయ్య నగర్‌లో నలుగురు, 13, 14 లక్ష్మీనృసింహకాలనీ సచివాలయం ఐదుగురు, 9వ సచివాలయం బాప్టిస్ట్‌పేటలో తొమ్మిదిమంది, కొప్పురావు కాలనీ 11వ సచివాలయంలో ఇద్దరు కలిసి 20 మంది స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రజలకు సేవలందిస్తున్న వలంటీర్లను విమర్శించే నాయకులు కరోనా సమయంలో ఇంటింటికి తిరిగి చేసిన సేవలను గుర్తించుకోవాలన్నారు.

కంతేరులో 26 మంది...

తాడికొండ: తాడికొండ మండలం కంతేరు గ్రామంలో వలంటీర్లు మూకుమ్మడి రాజీనామాలు అందజేశారు. ప్రతి నెలా సామాజిక సేవల్లో భాగంగా తాము పింఛన్లు అందించడంతో పాటు అన్ని రకాల సేవలు అందించామని, చంద్రబాబు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో తమను విధులకు హాజరు కాకుండా నిలిపివేయడం మనస్థాపానికి గురిచేసిందన్నారు. ఈ నేపథ్యంలో చంద్రబాబు వైఖరికి నిరసనగా మొత్తం 26 మంది వలంటీర్లు మూకుమ్మడిగా సర్పంచ్ బెజ్జం మహేష్ బాబు ఆధ్వర్యంలో తమ రాజీనామా పత్రాలు పంచాయతీ కార్యదర్శి రమేష్‌కు అందజేశారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అఖండ మెజార్టీతో గెలిపిస్తామని తెలిపారు.